ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 32
సంచిక : 32
పేజీలు : 3

మంగళవారం, సెప్టెంబర్ 09, 2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



## దేశాభివృద్ధికి శాస్త్రవేత్తలు అవసరం

**• పాఠశాల సిబ్బందితో కలెక్టర్**

**టి మీడియా, సెప్టెంబర్ 8,పినపాక ప్రతినిధి:**
దేశాభివృద్ధికి, ప్రజల భవిష్యత్ పురోగతికి శాస్త్రవేత్తలు అవసరమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం ఆయన కరకగూడెం జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల సమగ్ర పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్ ,మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశీలిస్తూ సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు.

కలెక్టర్ తరగతి గదిలో విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి జీవిత లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అవ్వాలని తమ అభిలాషను తెలియజేయగా, కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత లక్ష్యసాధనతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడే దిశగా చదువుకోవడం, పరిశోధనలు చేయడం అత్యంత ముఖ్యమని సూచించారు. సమాజంలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలు, పరిశోధనలు చేయగలిగే శాస్త్రవేత్తలు దేశానికి ఎంతో అవసరమని, విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

**అనంతరం**

కలెక్టర్ డైనింగ్ హాల్ పరిశీలించి అక్కడ దోమలు, ఈగలు లోపలికి ప్రవేశించకుండా మెష్ ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. కూరగాయలు, పెరుగు తదితర పదార్థాలు నిల్వ చేసుకోవడానికి ఫ్రిజ్ ఏర్పాటు చేయాలన్న సిబ్బంది అభ్యర్థనపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులు పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన, పౌష్టికాహారం తీసుకుంటూ చదువు కొనసాగించేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. నవోదయ విద్యాలయాలు దేశవ్యాప్తంగా ఒక ప్రత్యేకమైన బ్రాండ్‌గా గుర్తింపు పొందాయని, ఆ ప్రతిష్టను నిలబెట్టే విధంగా అధికారులు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందించాల్సిందిగా ఆయన సూచించారు. విద్యార్థుల మానసిక, శారీరక అభివృద్ధికి అవసరమైన క్రీడా సామాగ్రి, లైబ్రరీ పుస్తకాలు త్వరలోనే ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ పాఠశాల సిబ్బందితో సమావేశమై విద్యార్థులకు అందజేస్తున్న సదుపాయాలు, ఉన్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యున్నతికి, పాఠశాల అభివృద్ధి కోసం చేపట్టవలసిన పనులను తమ దృష్టికి తీసుకువస్తే వాటిని ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ భాస్కరాచారి, ఉపాధ్యాయులు నయనాదేవి, చంచల్, అనిత, స్టాఫ్ నర్స్ రాధిక, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## అర్జీలను పరిష్కరించాలి...

**• అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**టి మీడియా, సెప్టెంబర్ 8,ఖమ్మం**
:ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ప్రజల నుండిఅర్జీలను స్వీకరించారు. తూటికుంట్ల గ్రామ రైతులు అమరావతికి వెళ్ళు రోడ్డు నిర్మాణంలో 61, 64 సర్వే నెంబర్ వద్ద కొత్త బంధం చెక్ డ్యాం వరద నీళ్ల వెళ్ళుటకు ఒక్క కానా మాత్రమే నిర్మిస్తున్నారని, అది సరిపోక మొన్న కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల మీద వెళ్లడం జరిగిందని, మరొక కానతో బ్రిడ్జి నిర్మాణం చేయాలని దరఖాస్తు చేసుకోగా పిడి ఎన్.హెచ్.ఏ.ఐ. కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.ఖమ్మం నగరం బుర్హాన్ పురంకు చెందిన యనమందల కృష్ణ బాబు, తన కుమారుడు యనమందల వేణుగోపాల్ తెలంగాణ రాష్ట్రం కోసం మరణించారని, అమరుల కుటుంబాలకు ప్రకటించిన ప్రభుత్వ ఉద్యోగం తమ కోడలికి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కు రాస్తూ అవసరమైన

మిగతా 3లో





## పనుల్లో వేగం పెంచండి

**• మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**
**• జూన్ మాసంలోగా రిటైనింగ్ వాల్ పూర్తి**

**టి మీడియా, సెప్టెంబర్ 8,ఖమ్మం**: అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మంత్రివర్యుల క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలసి మున్నేరు రిటైనింగ్ వాల్, కేబుల్ బ్రిడ్జి, ఖిలా రోప్ వే పనుల పురోగతిపై అధికారులతో మంత్రివర్యులు సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, మున్నేరు వరదల నుండి నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా మున్నేరుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టామన్నారు. 690 కోట్ల తో మున్నేరుకు ఇరువైపులా 17 కి.మీ. మేర రిటైనింగ్ వాల్ నిర్మాణానికి గాను ఇప్పటివరకు 6.4 కి.మీ. మేర పనులు పూర్తయినట్లు తెలిపారు. మిగులు భూ సేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇరువైపులా పనులు సమాంతరంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. గత వరదల్లో జరిగిన నష్టం మళ్ళీ జరగొద్దని, వచ్చే జూన్ లోపే నిర్మాణం పూర్తయ్యేలా కార్యాచరణ చేయాలని మంత్రి అన్నారు.కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నిర్ణీత సమయంలోగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. 180 కోట్లతో చేపడుతున్న పనులు ఇప్పటివరకు 53 శాతం పూర్తయినట్లు తెలిపారు. అగ్రిమెంట్ ప్రకారం మార్చి లోపల పూర్తి అవ్వాల్సి ఉండగా, వర్షాల కారణంగా వచ్చే మే నెలాఖరుకు పూర్తి అవనున్నట్లు మంత్రి అన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం ఖమ్మం ఖిలా పై నిర్మిస్తున్న రోప్ వే కు భూ సేకరణ పూర్తయినట్లు మంత్రి తెలిపారు. 29 కోట్లతో చేపడుతున్న రోప్ వే సివిల్ పనులు నెలాఖరుకు ప్రారంభించి, వచ్చే జూలై నాటికి అగ్రిమెంట్ ప్రకారం మొత్తం పూర్తి చేయాలన్నారు.ఖిలా పై చేపట్టాల్సిన పనుల గురించి ప్రణాళిక చేయాలన్నారు. ఖిలా కు రోడ్ కనెక్టివిటీ విస్తరణ కు చర్యలు చేపట్టాలన్నారు. నగరం చుట్టూ జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతుందన్నారు. ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారిపై ధాంసలాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి, మున్నేరు పై బ్రిడ్జి పనులు జరుగుతున్నాయన్నారు. కలకత్తా, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ లో సగ భాగం ప్రాంతాలకు ఖమ్మం గుండానే రాకపోకలు ఉంటాయన్నారు. నగరం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. నగరంలోకి రాకుండానే ఆయా గమ్యస్థానాలకు వెళతారని, నగరంలో ట్రాఫిక్ సమస్య ఉండదని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్, మెడికల్ కళాశాల, స్వామి నారాయణ్ స్కూల్ లు త్వరలో అందుబాటులోకి వస్తాయని మంత్రి అన్నారు.ఈ సమీక్ష లో ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈనాటి అద్భుతాలన్ని నాటి ఆలోచనలే





**• గుండాల కృష్ణ**
**• యస్.బి.ఐ.టి. లో బూటా క్యాంప్**

**టీ మీడియా సెప్టెంబర్ 8 ,ఖమ్మం :**
ప్రస్తుతం అద్భుతంగా కనిపించేవన్ని ఒక నాటి ఆలోచనలలోనుంచి ఉద్భవించినవే నని యస్.బి.ఐ.టి. కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం కళాశాలలోని ఇన్నోవేషన్ సెల్ ద్వారా నిర్వహించిన అంతర్గత హ్యాకథాన్, ఐడియ బూట్ క్యాంప్ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ తీక్షగా గమనిస్తే ప్రతి విషయంలోను సృజనాత్మకత కనిపిస్తుందని, సమాజంలో జరిగే మార్పులన్ని ఆలోచనలను ఆచరణలో పెట్టడం ద్వారానే సాధ్యమైనవని గుర్తు చేసారు.జాతీయ విద్యాశాఖ, విద్యాశాఖ ఇన్నోవేషన్ సెల్, ఎఐసిటిఈ వారు సంయుక్తంగా నిర్వహించే స్మార్ట్ ఇండియా హ్యాకథాను సిద్దపడు ఉద్దేశ్యంతో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా థింక్వాండ్ సి.ఈ.ఒ. అండ్ డైరెక్టర్ వరదా శ్రీనివాస్, టెక్ స్నాప్ ఏ.ఐ. చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ సాయిపవన్

మిగతా 3లో



## న్యాయం జరిగే దాకా పోరాటం : బడే నాగజ్యోతి

**టి మీడియా, సెప్టెంబర్ 8,ములుగు :** పారిశుధ్య కార్మికుడు మైదం మహేశ్ కుటుంబానికి న్యాయం జరిగే దాకా ప్రభుత్వంపై పోరాటం చేస్తామని బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి తెలిపారు. గత ఆరు నెలలుగా జీతాలు అందక, అధికారుల వేధింపులు తట్టుకోలేక ములుగు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడు మైదం మహేశ్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యనేనన్నారు. దీనికి మంత్రి సీతక్క బాధ్యత వహించాలన్నారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో కలిసి ఏరియా హాస్పిటల్ నుండి బస్టాండ్ వరకు భిక్షాటన చేశారు.ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ.. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాల్సిన సర్కార్ మహేశ్ మరణంపై దుష్ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. మంచినీళ్లు అనుకుని పురుగుల మందు తాగినట్టు చెప్పి ఒక ఫేక్ వీడియోను సృష్టించి సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. ఆదుకోవాల్సిన సర్కారు ఇలాంటి దుర్మార్గానికి ఒడిగట్టడంపై ఆమె మండిపడ్డారు. తప్పుడు చర్యలతో ప్రభుత్వం ఘోర వైఫల్యం కప్పిపుచ్చుకోలేదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ములుగు మండలాధ్యక్షుడు సానికొమ్ము రమేశ్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ చెన్న విజయ్, వేములపల్లి భిక్షపతి, పోరిక విజయ్, రామ్ నాయక్, గొర్రె సమ్మయ్య, కోగిల మహేశ్, వేల్పుల సత్యం, ఆకుతోట చంద్రమౌళి, గరిగే రఘు, బైకాని సాగర్, గండి కుమార్, కవ్వంపల్లి బాబు, గడ్డమీది భాస్కర్, యూనిస్, మాదం సాగర్, వాంకుడోత్ రాందాస్, దూడబోయిన శ్రీనివాస్, గజ్జి నగేశ్, సోహెల్, కోడపాక మహేందర్, జట్టి పున్నం, దేవర రాజు, ఇరుప విజయ, మర్రి అంకుష్, ఎండీ ఖాసీం, ఆరెపల్లి కిషన్ పాల్గొన్నారు.



## కాంగ్రెస్ వారికే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చారు

**టి మీడియా, సెప్టెంబర్ 8,బోనకల్లు :**
బోనకల్లు మండల పరిధిలోనే గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన 60 నిరుపేద కుటుంబాలు తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఇందిరమ్మ గ్రామ కమిటీల పేరుతో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారని, నిరుపేద కుటుంబాలకు మంజూరు చేయలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత మాట్లాడుతూ.. గోవిందాపురం ఎల్ గ్రామంలో 4 ఎకరాలు, 2 ఎకరాలు, 3 ఎకరాల వ్యవసాయ భూమి కలిగిన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారన్నారు. అనేక ఏళ్లుగా పూరి గుడిసెల్లో నివాసం ఉంటూ సెంటు భూమి కూడా లేని వారికి ఇల్లు మంజూరు చేయలేదన్నారు.రాజకీయ కారణాలతో ఇందిరమ్మ కమిటీ సభ్యులు నిరుపేదలకు ఇల్లు మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామాల్లో అర్హత కలిగిన వారికి ఇవ్వాలని ఒకవైపు ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు చెబుతున్నారన్నారు కానీ కేవలం రాజకీయ కారణాలతో కాంగ్రెస్ కు చెందిన వారికే ఇల్లు మంజూరు చేయడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. సిపిఎం మాజీ ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య, నాయకులు తమ్మారపు లక్ష్మణ్, కొమ్ము శ్రీనివాసరావు, వల్లంకొండ సురేశ్, ఏడునూతల లక్ష్మణరావు పాల్గొన్నారు.

## రోకటి సురేష్ మృతి పట్ల మాజీ ఎంపీ నామ సంతాపం

**టీ మీడియా సెప్టెంబర్ 8 ,ఖమ్మం** :జూలూరుపాడు మండలం, పాపకొల్లు గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు, మున్నూరు కాపు సంఘం నాయకులు, మాజీ ఎంపీటీసీ రోకటి సురేష్ మృతి పట్ల బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. వారి మరణం గ్రామానికి, కుటుంబ సభ్యులకు తీరని లోటు అని నామ పేర్కొన్నారు. రోకటి సురేష్ కుటుంబ సభ్యులుకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థించారు.



# ఇద్దరు దొంగల అరెస్ట్

### -రూ. 16.00 లక్షల సొత్తు స్వాధీనం



**టి మీడియా, సెప్టెంబర్ 8,ఖమ్మం:** నగర పోలీసులు సోమవారం ఇద్దరు దొంగలను అరెస్ట్ చేశారు. వీరివద్ద నుంచి రూ. 16.00 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం సిటీ ఏసీపీ రమణమూర్తి మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఖమ్మంలోని ముస్తఫానగర్ కు చెందిన చల్లా వెంకటేశ్వర్లు, భద్రాచలంలోని శ్రీరామ్ నగర్ కు చెందిన దేవనబోయిన మహేష్ అలియాస్ బాతు అనే వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతుంటారు. గత మే 14వ తేదీన ఖమ్మం బైపాస్ రోడ్ లో చైన్ స్నాచింగ్, మార్చి 12వ తేదీన రోటరీ నగర్ లో ఇంటి తాళం పగులగొట్టి చోరీ, గత ఏప్రిల్ 8వ తేదీన మామిళ్లగూడెంలో మహిళ మెడలో గల చైన్ స్నాచింగ్, గత జూలై 4వ తేదీన బ్యాంకు కాలనీలో ఇంటి తాళం పగులగొట్టి చోరీ, అదే నెల 27వ తేదీన సహకార నగర్ లోని ఇంట్లో చోరీ, గత ఫిబ్రవరి 8వ తేదీన సంభాని నగర్ లో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం, గత మే 3వ తేదీన సంభాని నగర్ లోనే మరో ఇంటలో వీరిద్దరూ దొంగతనానికి పాల్పడ్డారు. ఈ ఇద్దరి నేర చరిత్రలో ఇవి ముఖ్యమైన ఘటనలుకాగా, వీటితోపాటు పోలీస్ స్టేషన్ల వారీగా ఖమ్మం -1 టౌన్ పరిధిలో ఐదు, అర్బన్ పరిధిలో నాలుగు, రూరల్ పరిధిలో రెండు, బోనకల్ లో రెండు, కామేపల్లి, వేంసూరు, ఏన్కూరు, సత్తుపల్లి, కొత్తగూడెం-3 టౌన్ పరిధిల్లో మొత్తం 26 చోరీలకు పాల్పడ్డారు.ఈ ఇద్దరు దొంగలు సోమవారం అనూహ్యంగా పోలీసులకు పట్టుబడినట్లు ఏసీపీ చెప్పారు. టూ టౌన్ సీఐ బాలక్రిష్ణ తన సిబ్బందితో కొత్త బస్ స్టేషన్ వెనుకవైపున ఎన్ఎస్టీ రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తుండగా బైకుపై వెడుతూ, పోలీసులను చూసి తప్పించుకునే ప్రయత్నం చేశారని ఏసీపీ రమణ మూర్తి పేర్కొన్నారు. అయితే అనుమానంతో పోలీసులు వారిని పట్టుకుని, వారివద్ద గల బ్యాగును తనఖీ చేయగా దొంగిలించిన బంగారు, వెండి వస్తువులతో పట్టుబడినట్లు చెప్పారు.పట్టుబడిన దొంగల నుంచి 45 గ్రాముల బంగారు నాన్ తాళ్లు, 22 గ్రాముల బంగారు గాజులు, 40 గ్రాముల బంగారు చెయిన్లు, రింగులు, 22 గ్రాముల నాలుగు జతల చెవి దుద్దులు, అరకిలో వెండి ప్లేటు, రెండు మోటార్ సైకిళ్లు, ఒక స్కూటీ, కలర్ టీవ తదితర సామాగ్రి సహా మొత్తం రూ. 16.00 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ రమణ మూర్తి మీడియా సమావేశంలో వివరించారు. వరుస చోరీలకు పాల్పడుతున్న ఈ ఇద్దరు దొంగలను చాకచక్యంగా పట్టుకున్న సీఐ బాలక్రిష్ణను, ఇతర పోలీసు సిబ్బందిని ఏసీపీ రమణమూర్తి అభినందించారు. మీడియా సమావేశంలో సీసీఎస్ ఏసీపీ సర్వర్ తదితరు పోలీసు అధికారులు కూడా పాల్గొన్నారు.



## కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు

### -పాపినేని రామ నర్సయ్య

**టి మీడియా, సెప్టెంబర్ 8,బోనకల్లు:** గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మధిర డివిజన్ కార్యవర్గ సభ్యుడు పాపినేని రామ నర్సయ్య అన్నారు. సోమవారం తూటికుంట్ల గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆఫీస్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో వీధి లైట్లు లేక రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో పారిశుధ్య సమస్య పేరుకుపోయిందని, రోడ్ల వెంట పిచ్చి మొక్కలు బాగా పెరిగి ప్రయాణికులకు ఇబ్బందిగా మారాయన్నారు. గ్రామంలో అనేక చోట్ల నీరు నిల్వ ఉండి దోమలు పెరిగి ప్రజలు జ్వరాల భారిన పడుతున్నట్లు చెప్పారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి సమస్యలపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి బి.సురేశ్కి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు నోముల పుల్లయ్య, శాఖ కార్యదర్శి పాపినేని వెంకటరావు, మాజీ వార్డు మెంబర్స్ కంచర్ల కృష్ణ , ఫణితి బాలరాజు, శాఖ సభ్యులు గుమ్మ శ్రీనివాసరావు, గుమ్మ వెంకయ్య, పోలేటి సత్యం, సాధినేని ప్రసాద్, కుదురుపాక వెంకటేశ్వర్లు, పెద్ద గోపాల్ రావు, కంకణాల గోపాలరావు పాల్గొన్నారు.

## ఎన్‌సిసి క్యాంపును సందర్శించిన కలెక్టర్

**టి మీడియా, సెప్టెంబర్ 8,పినపాక ప్రతినిధి:**
అశ్వాపురం మండల పరిధిలోని మిట్ట గూడెం ప్రభుత్వ గిరిజన గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్ సి సి క్యాంపును సోమవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు.ఖమ్మం లోని11తెలంగాణ ఎన్ సి సి బెటాలియన్ఆధ్వర్యంలో పది రోజులు నిర్వహించే క్యాంపు సోమవారం ప్రారంభమైంది.క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్.కె భద్ర మరియు క్యాంప్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ నవీన్ యాదవ్ కలెక్టర్ ను కలిశారు. మణుగూరు ప్రాంత యువతకు ఎన్ సి సి పట్ల అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని కలెక్టర్ ఎత్తి చూపారు. శిబిరం సజావుగా నిర్వహించడానికి దాని ప్రాముఖ్యతను ప్రశంసించారు. ఎన్ సి సి అడ్వెంచర్ క్యాంపులకు ఉపయోగించుకోగల రథంగుట్ట మరియు తుమ్మల చెరువు ప్రాంతాలను కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మణిధర్, ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్, ఎం పి ఓ ముత్యాలరావు, కళాశాల ప్రిన్సిపాల్ రవి పాల్గొన్నారు.





## ఆన్లైన్ విధానం నుండి ఏఎన్ఎంలని మినహాయించాలి

**టి మీడియా, సెప్టెంబర్ 8, ఖమ్మం:**
తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మెడికల్ ఆఫీసర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నందు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణా కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బి కృష్ణవేణి, మరియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జే కొండలరావు, కాసాని వీరయ్య తదితరులు పాల్గొని, రాష్ట్రవ్యాప్తంగా ఏఎన్ఎంలో ఆన్లైన్ విధానంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నామని, అందరూ ఆన్లైన్ విధానంలో 10 నుంచి 12 గంటల వరకు పని భారం పెరిగిందని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చాలా జీవితాలతో పబ్బం గడపవలసి వస్తుందని, కావున ఏఎన్ఎంలు అందరినీ ఆన్లైన్ విధానం నుంచి మినహాయించాలని కోరారు. ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో సెప్టెంబర్ 15వ తారీఖున అన్ని జిల్లా కలెక్టర్ ఆఫీసుల ముందు ధర్నా నిర్వహిస్తామని, అవసరమైతే సమ్మెకు కూడా వెనకాడబోమని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి పెద్ద ఎత్తున ఏఎన్ఎంలు తరలి వచ్చారని వారందరికీ సంపూర్ణ ధన్యవాదాలు యూనియన్ జిల్లా కమిటీ నుంచి తెలియజేస్తున్నాము.

## నిండుకుండలా తుమ్మలచెరువు

### -ఎండుతున్న వరి పొలాలు

**టి మీడియా, సెప్టెంబర్ 8,పినపాక ప్రతినిధి:**
అశ్వాపురంమండలంలో అతిపెద్ద సాగునీటిపరులైన కాకతీయుల కాలం నాటి తుమ్మల చెరువు నిండుకుండలా తలపిస్తుప్పటికీ, చెరువు మెయిన్ తూము, అలుగు తూముల షట్టర్లు పనిచేయకపోవడంతో ఆయకట్టు పరిధిలోని వరి పొలాలు ఎండిపోతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసవిలోనే తూముల షట్టర్ల మరమ్మతులు చేపట్టాల్సి వుప్పటికీ, ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతుల పాలిట శాపంలా మారింది. ప్రస్తుతం చెరువులో 20 అడుగుల నీళ్లు ఉన్నాయి. సోమవారం రైతులు జెసిబి సహాయంతో 20 అడుగుల లోతులో ఉన్న షట్టర్లను లేపేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. తుఫానుల కారణంగా వరిచేలు జీవం పోసుకున్నాయని, లేదంటే ఎండిపోయే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి తూముల షట్టర్లు రిపేరు చేయాలని, లేనిపక్షంలో ఆయకట్టు రైతులంతా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.





## మాలమహానాడు సంఘం లీడర్ల ముందస్తు అరెస్టులు

**టీ మీడియా,సెప్టెంబర్ 8, ఖమ్మం:**ఎస్సి వర్గీకరణ కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేల కార్యాలయాల ముట్టడి ముట్టడికి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నగరంలో అసంఘం నాయకులను సంబంధిత పోలీస్ స్టేషన్ సిబ్బంది తెల్లవారే నాయకుల ఇండ్లకు వెళ్లి పలువురిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో సంఘం సీనియర్ నాయకులు గుంతేటి వీరభద్రం,సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాసరావు,రాష్ట్ర అధికార ప్రతినిధి ముడుసు జాకోబ్ తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ...

సుప్రీంకోర్టు ఎస్సివర్గీకరణకు ఇచ్చిన సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పాటించకుండా,కాంగ్రెస్ పార్టీ తమ జాతికి తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.వర్గీకరణ అమలులో మాలలను మూడవ గ్రూప్ లో చేర్చి రోస్టర్ పాయింట్లు ఎక్కువ చేసి విద్యార్థి యువతకు తీవ్ర నష్టం కలిగించేలా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. జనాభా ప్రాతిపదికన 20 శాతం రిజర్వేషన్లు పెంచాలని ఆయన ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు.మూసివేసిన ప్రభుత్వ రంగ సంస్థలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రసంగాలు,రాసిన వ్యాసాలను రాష్ట్ర ప్రభుత్వం ముద్రించాలని డిమాండ్ చేశారు.



## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కాళోజీ : మాజీ ఎంపీ నామ

**టీ మీడియా సెప్టెంబర్ 8 ,ఖమ్మం** :ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 9న ఘనంగా నిర్వహించుకోనున్న సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కాళోజీ అని, ఆయన కవిత్వం కేవలం సాహిత్యమే కాకుండా సామాజిక మార్పుకు మార్గం చూపిన శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. పేదల వేదన, ప్రజల ఆశలు, సామాజిక అన్యాయాలను ప్రతిబింబించేలా ఆయన రచనలు నేటికీ తరతరాలకు ప్రేరణనిస్తున్నాయని గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించి, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ప్రజాకవి కాళోజీ అని నామ అన్నారు. సాదాసీదా జీవనం గడిపి, తన ఆలోచనలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడని ఆయన పేర్కొన్నారు. నాడు తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ పాలనలో కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించడం గర్వకారణమని నామ తెలిపారు. కాళోజీ కలలు, ఆకాంక్షలు సాకారం చేసే దిశగా మనమందరం ముందుకు సాగాలని కోరారు.

### ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు

## తెలిపిన మల్లి బాబు యాదవ్

**టీ మీడియా సెప్టెంబర్ 8 కామేపల్లి :**ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మ దిన%శీ% ను పురస్కరించుకొని మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులుతో భారీ ఎత్తున ఇల్లందు క్యాంప్ ఆఫీస్ కి చేరుకొని భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని ఆనందోత్సాహాలతో పండుగలాగా సంబరం జరుపుకున్నారు.



# ఇల్లు కట్టుకోవడానికి సహాయం చేయండి..

**-దాతలు కోసం ఎదురుచూస్తున్న నిరుపేద**

**-నా వంతు సాయం అంటూ ముందుకు వచ్చిన ఎస్కే గౌసుద్దీన్**

**టీ మీడియా, సెప్టెంబర్ 08,సింగరేణి(కారేపల్లి):**

సింగరేణి గ్రామంలో ఒకప్పుడు ఎంతో గొప్పగా బతికినా కుటుంబం నేడు ఇల్లు లేక ఇందిరమ్మ ఇల్లు వచ్చినా కాని కట్టుకునే స్తోమత లేక సహాయం చేయలని అంటూ పలువురిని వేడుకుంటున్నారు.ఇల్లు లేక చినిగిపోయిన డేరాల కట్టుకొని బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన పరిస్థితి ఆ కుటుంబానిది.ఆ షాపుల వద్ద ఈ షాపుల వద్ద..చిన్న చిన్న సరుకులు మోస్తూ, తమలపాకులు అమ్ముకుంటూ, వచ్చిన నాలుగు రూపాయలతో కుటుంబాన్ని పోషించుకోవాల్సిన దుస్థితి మండలంలో ఆ కుటుంబానికి వచ్చింది.వీళ్ళ దీనావస్థ చూసి ..అయ్యో ఒకప్పుడు మంచిగా బతికిన కుటుంబం, ఇప్పుడు ఈ పరిస్థితుల్లో ఉన్నది.పగవారికి కూడా ఈ పరిస్థితి రాకూడదు' అని కనికరించే.. మంచి మనసున్న వారు "ఇదిగో సింగ్ ఇది తీసుకో" అని పదోపరకో ఇస్తే.. కుటుంబాన్ని వెల్ల దీయాల్సిన హృదయ విధారకర పరిస్థితి లో ఆ కుటుంబం ఇప్పుడు ఉంది.

**వివరాలలోకి వెళ్తే....**

కారేపల్లి రైల్వే స్టేషన్ బజార్లో నివాసముండే జమిందార్ల కుటుంబం సింగ్ ఠాకూర్ కుటుంబం అంటే అందరికీ తెలుసు. కారేపల్లి రైల్వే స్టేషన్ నుంచి,బస్టాండ్ సెంటర్, లాడిస్ బజార్,కొత్త సొసైటీ ఆఫీస్ వరకు.. ఉన్న స్థలాలన్నీ వీరి ఖాన్దాన్ లో ఒకప్పుడు ఉండేవి.ఆ రోజుల్లో వీరి ఇంట్లోనే చేత బావి ఉండేది.కారేపల్లి (సింగరేణి) రైల్వే స్టేషన్కు సమీపంలో ఉన్న ప్రజలు ఈ చేత బావిలోనే నీళ్ళ తెచ్చుకునేవారు. ఒకప్పుడు బాగా బతికిన కుటుంబం..ఇప్పుడు ధీనమైన స్థితిలో ఉన్నది. డేరాలు కట్టుకొని ఉండే ఇంట్లో..వృద్ధురాలైన హంసవలి ఠాగూర్ , ఆమె నలుగురు కుమారులు రాజేందర్ సింగ్ ఠాగూర్, ధర్మేందర్ సింగ్ ఠాగూర్, రామేందర్ సింగ్ ఠాగూర్, రఘునందన్ సింగ్ ఠాగూర్ తో పాటు,ఇద్దరు కుమార్తెలు..గులాబీ రాణి ఠాగూర్,గంగారాణి ఠాగూర్ లు నివసిస్తున్నారు. వృద్ధురాలకు వచ్చే పెన్షన్ తో ఆమె మందులకే సరిపోతుండగా..ఇంట్లో ధర్మేందర్ సింగ్ ఠాగూర్ తప్ప, మిగతా వారంతా మానసిక వ్యాధులతో బాధపడుతున్నారు. వర్షం వస్తే వీళ్ళ పరిస్థితి వర్ణాతీతం. పైనుంచి కారుతున్న నీళ్లను గిన్నెలతో పట్టుకొని బయట పారబోసే పరిస్థితి నెలకొంది. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ.. జీవనం గడుపుతున్న ఠాగూర్ కుటుంబాన్ని ఆదుకోవడానికి మనమంతా ముందడుగు వేయాలన్న భావనంతో..వారి యొక్క కుటుంబ పరిస్థితిని వివరించాల్సి వచ్చింది.

**ఇటీవల.. సింగ్ కుటుంబానికి**

ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయింది. కాగా స్థానిక మేస్త్రితో మన గ్రామ పెద్దలు కొంతమంది కలగజేసుకొని ఇంటి నిర్మాణ విషయమై మాట్లాడారు.అయితే ప్రభుత్వం ఇచ్చే రూ 5 లక్షలతో పాటు, అదనంగా రెండు లక్షలు ఇస్తే.మెటీరియల్ తో



సహా ఇల్లు నిర్మించి ఇస్తానని. ఓ మేస్త్రి హామీ ఇవ్వడం జరిగింది.చేతిలో చిల్లి గవ్వలేని పరిస్థితి.ఏమి చేయాలో తోచని పరిస్థితిలో సింగ్ కుటుంబం తమకు తెలిసినా దుకాణదారులను,గ్రామ పెద్దలను ఈ విషయమై కలిసి మాకు తోచిన సహాయం ఎంతో కొంత చేయాలని వేడుకున్నారు. మంచి మనసుతో గ్రామంలోని ప్రజలు సహృదయంతో మా కుటుంబానికి ఆసటగా నిలుస్తారని, తమకు తోచిన ఆర్థిక సాయం చేయాలని వేడుకుంటున్నారు.

**ముందుకు వచ్చిన గౌసిద్దీన్**

పేదవారికి అండగా ఉంటానంటూ ఏ కష్టం వచ్చినా నేనున్నా అంటూ ముందుకు వచ్చే సింగరేణి గ్రామస్తుడు ఎస్కే గౌసుద్దీన్ తన వంతుగా..పది కట్టల సిమెంటు బస్తాలు ఇస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఇంకా ఎవరైనా దాతలు ఉంటే ఈ పేద కుటుంబానికి సహాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సింగరేణి గ్రామ పెద్దలు తురక నారాయణ, గంగరబోయిన శ్రీనివాసరావు,ఖలీలుల్లా ఖాన్ పాల్గొన్నారు.



## నిష్పక్షపాత ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఖరారుకు
- రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష

**టీ మీడియా సెప్టెంబర్ 8 , పాల్వంచ**

రాష్ట్ర ఎన్నికల సంఘం వారు జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం రెండవ సాధారణ ఎన్నికలు (ఎంపీటీసీ/ జెడ్పిటిసి -2025) నిర్వహణలో భాగంగా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారాల కోసం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కోసం తయారుచేసిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా పోలింగ్ స్టేషన్లో జాబితాను రాజకీయ పార్టీ నాయకులకు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 471 పంచాయతీలలో మొత్తం 6,69,048 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 3,25,045, మహిళలు 3,43,979 మంది కాగా 24 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. 4168 వార్డులకు గాను 4242 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ తప్పకుండా ఓటు హక్కు కల్పించేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారని కలెక్టర్ తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు చేసుకోవడం కోసం ఇప్పుడే దరఖాస్తు చేసుకోవాలని, నోటిఫికేషన్ వెలువడిన తర్వాత కొత్త పేర్లు చేర్పులు ఉండబోవు అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి ఓట్లు బదిలీ చేయడం సాధ్యం కాదని తెలిపారు. ఇప్పటివరకు గుర్తించిన పోలింగ్ కేంద్రాలు యధాతరంగా కొనసాగుతాయని, వాటిలో ఎటువంటి మార్పులు ఉండబోవని ఆయన అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డిప్యూటీ జెడ్పి సీఈవో చంద్రశేఖర్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ బాల ప్రసాద్, భారతీయ రాష్ట్ర సమితి- అనుదీప్, సిపిఐ ఎస్.శ్రీనివాస్, సీపీఐ(ఎం) నుంచి ఏ.సత్యనారాయణ, భారతీయ జనతా పార్టీ -నోముల రమేష్, ఆమ్ ఆద్మీ పార్టీ- ఏ. రాంబాబు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఈనాటి అద్భుతాలన్ని నాటి ఆలోచనలే

సాకేత్, టాస్క్ తెలంగాణ ప్రాజెక్ట్ మేనేజర్ బాలు ప్రవరాఖ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరదా శ్రీనివాస్ మాట్లాడుతూ తరగతి గదిలోనే రేపటి సమాజం తయారవుతుందని తెలిపారు. సాయిపవన్ సాకేత్ మాట్లాడుతూ ప్రతి అలోచన మొదట వింతగానే కనిపిస్తుందని, పట్టు వదలకుండ ప్రయత్నించినపుడే అద్భుతం సృష్టించగలమని తెలిపారు. నిన్నటి తరం ఆలోచనల నుంచే నేటి ఇంటర్నెట్ ఆవిర్భవించిందని బాలు ప్రవరాఖ్య వ్యాఖ్యానించారు.కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా? జి. ధాత్రి మాట్లాడుతూ తమ కళాశాల ఇన్నోవేషన్ సెల్ విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టె క్రమంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత సంవత్సరం టాస్క్ వారి ఐ4టివై2.0 రాష్ట్రస్థాయి హ్యాకథాన్ లో తమ కళాశాలకు చెందిన 10 గ్రూప్లు అర్హత సాధించాయని, జాతీయ స్థాయిలో నిర్వహించిన బిజినెస్ ప్లాన్ ఛాలెంజ్లో కూడా తమ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు గుర్తుచేసారు. కళాశాల వైస్ ఛైర్మన్ శ్రీచైతన్య మాట్లాడుతూ, ఇన్నోవేషన్ అనేది సృజనాత్మకత కూడిన ప్రక్రియ అని, విద్యార్థులు తమ ఆలోచనలనుసామాజికఅవసరాలకనుగుణంగా వృద్ధిచేసి అంకుర సంస్థలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డా? జి. రాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ సృజనాత్మకత దాగి ఉంటుందని, దానిని వెలికితీసే పనిలో తమ కళాశాల ఇన్నోవేషన్ సెల్ నిరంతరం కృషి చేస్తుందని, రానున్న రోజులలో మరిన్ని ఆవిష్కరణలు తమ కళాశాల నుంచి ఉద్భవిస్తాయని ఆశాభావం వ్యక్తం చేసారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు రూపొందించిన లోగోను ఆవిష్కరించారు మరియు వారు ప్రదర్శించిన ఆలోచనలు పలువురి ప్రశంసలు పొంది ఆలోచింపజేసాయి.ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్నోవేషన్ సెల్ హెడ్ డా? మురళిమోహన్, కోఆర్డినేటర్ పి. అశ్విని, అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా? ఎ.వి.వి. శివ ప్రసాద్, డా? జె. రవీంద్రబాబు, హెచ్.ఒ.డిలు, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను పరిష్కరించాలి...

చర్యలు తీసుకోవాలని అన్నారు.పెనుబల్లి మండలం మర్లకుంట గ్రామానికి చెందిన జొన్నలగడ్డ హారిక, తనకు ఎస్సి గురుకుల పాఠశాలలో 8వ తరగతి సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎస్సి గురుకులాల జోనల్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఖమ్మం నగరానికి చెందిన ఎం. సుశీల, తనకు సొంత ఇల్లు లేదని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లేదా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో డి.ఆర్.ఓ. ఏ. పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.